క్లుప్తంగా

డ్రెయినేజీ పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న కౌన్సిలర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.3.64 లక్షలతో చేపట్టనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను కౌన్సిలర్ గడ్డం విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం రాజు, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



డ్రైవర్ జీడీ రెడ్డిని సన్మానిస్తున్న ఏఎంవీఐలు, డీఎం

మంచిర్యాలఅర్బన్: డ్రైవర్ల అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని ఏఎంవీఐ ఖాసీం, సూర్యతేజ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్స్ డేను పురస్కరించుకుని ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మద్యానికి దూరంగా ఉండాలని, విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వాడొద్దన్నారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్ జీడీ రెడ్డిని సన్మానించారు. అంతకుముందు డ్రైవర్లకు గులాబీపూలు అందజేసి డ్రైవర్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, ఎంఎఫ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం



సాయిచందనకు బాండ్‌ను అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, పూర్వ విద్యార్థులు

తాండూర్: అనారోగ్యంతో మృతి చెందిన పూర్వవిద్యార్థి కుటుంబానికి సహచర పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేశారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థి రజిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమెతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి రజిత కూతురు సాయిచందనకు రూ.50 వేలను ఎస్బీఐలో ఫిక్స్‌డ్‌చేసి శుక్రవారం బాండ్‌ను అందజేశారు. పూర్వవిద్యార్థులు, బ్యాంక్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ పరిధిలో గల ఐదు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడంతో శనివారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు నిలిపివేస్తున్నట్లు కార్యదర్శి రామాంజనేయులు, సీసీఐ సీపీవో డి.కె నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ప్రారంభించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రైతులకు చేయూతనందిద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మీనారాయణ

జన్నారం: రైతులకు చేయూతనందించేలా అందరూ ఐకమత్యంతో పని చేద్దామని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాలకవర్గ సభ్యులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో గోదాంల నిర్మాణానికి, వారసంత మార్కెట్ యార్డులోకి వస్తే దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. కొన్ని గోదాంలు మరమ్మతు విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఫసీఉల్లా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో కళాజాత

దండేపల్లి: మాదాపూర్, మామిడిపల్లి గ్రామాల్లో సాంస్కృతి సారధి ఆధ్వర్యంలో కళాకారులు శుక్రవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కళాకారులు రమేశ్, కృష్ణ, క్రాంతికుమార్, రవళిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డున్నా బస్సు సౌకర్యం కరువు

- ఒత్కులపల్లి, చాకెపల్లి గ్రామాల్లో దుస్థితి
- చెన్నూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు
- ప్రజలు, రైతులు కాలినడకన ఆస్నాద్ బస్టాప్ వద్దకు
- ఆపై బస్సుల కోసం ఎదురుచూపు



ఒత్కులపల్లి గ్రామానికి ఉన్న బీటీ రోడ్డు ఇదే..

చెన్నూర్‌రూరల్: బీటీ రోడ్ల సౌకర్యం ఉన్నప్పటికీ ఆ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు ఉండగా, సుమారు 35 గ్రామాల వరకు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి దాదాపు 500ల మందికి పైగా విద్యార్థులు చదువుకోవడానికి, రైతులు, ప్రజలు వివిధ పని నిమిత్తం చెన్నూర్ మండల కేంద్రానికి వస్తుంటారు. ఇందులో ఒత్కులపల్లి, చాకెపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ప్రతిరోజు 3 కి.మీ కాలినడకన ఆస్నాద బస్టాప్ వద్దకు చేరుకుని బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కాచన్‌పల్లి, సంకారం, బుద్దారం వెళ్లే దారిలో వంతెనలు, బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బస్సు సౌకర్యం కానరావడం లేదు. గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుని అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారు.

వారం రోజులే బస్సు..నిలిపివేత

కాచన్‌పల్లి, గంగారం, కమ్మరిపల్లి, సుద్దాల గ్రామం వరకు గత రెండేళ్ల క్రితం వారం రోజులు మాత్రమే బస్సు నడిపించారు. ఆ తర్వాత నిలిపివేశారు. ప్రజలు వివిధ పనులపై మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వారికి ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి. పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్తున్నారు. ప్రయాణం ప్రమాదమని తెలిసినా వెళ్లడం తప్పడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పట్టించుకుని బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మా ఊరికి వెళ్లేందుకు బీటీ రోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేదు. ప్రతిరోజు మాకు అవస్థలు పడుతున్నాం. వృద్ధులు, చిన్నపిల్లలకు ఇబ్బందిగా మారింది. బస్సు సౌకర్యం కల్పించేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– అంకయ్య,ఒత్కులపల్లి

పట్టించుకోవాలి



గతంలో వర్షాకాలంలో వాగు ఉప్పొంగితే ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉండేది. సంకారం, బుద్దారం వాగులపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తయింది. అధికారులు పట్టించుకుని బస్సు సౌకర్యం కల్పించాలి.

– అర్జయ్య, సంకారం

ముగిసిన వార్డుసభలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వార్డుసభలు శుక్రవారంతో ముగిశాయి. రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి కొత్తగా 6 వేల దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. 30వ వార్డులో శుక్రవారం నిర్వహించిన సభలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే అన్నారు. ముల్కల్ల, టీకానపల్లిలో నిర్వహించి గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. టీకానపల్లిలో తహసీల్దార్ మాట్లాడుతూ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక నిరంతరం సాగుతుందన్నారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్‌షరీఫ్, ఏవో కృష్ణ, ఈజీ ఎస్ ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పుల్లగామ గ్రామస్తులు

గ్రామస్తుల నిరసన

కోటపల్లి: ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పుల్లగామ గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అర్హులకు కాకుండా భూమి ఉన్నవారిని ఎంపిక చేశారని మండిపడ్డారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

‘ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్న ప్రభుత్వం’

తాండూర్: సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారాం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల కోసం ప్రజలు దరఖాస్తులు చేస్తే అధికారులు ఇళ్లకు వచ్చి సర్వేచేశారని తెలిపారు. మళ్లీ గ్రామసభలు నిర్వహించి జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. వారు చేసిన సర్వేకు విలువ లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం శ్రేణులు నానయ్య, రమణ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

లైట్‌జాబ్‌కు వెంపర్లాడొద్దు

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ
- కారుణ్య నియామక పత్రాలు అందజేత

శ్రీరాంపూర్: ఉద్యోగంలో చేరిన వెంటనే లైట్ జాబ్ కోసం వెంపర్లాడొద్దని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం 13 మంది యువతి, యువకులకు కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ చాలామంది యువ ఉద్యోగులు ఉద్యోగంలో చేరిన వెంటనే లైట్‌జాబ్ కావాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సంస్థలో ప్రతి డిజిగ్నేషన్ ఉత్తమమైనదే అని అన్నారు. గతంలో పోల్చితే చాలా పనులు సులువయ్యాయన్నారు. అధికారులు చెప్పిన పనులను క్రమ శిక్షణతో చేస్తే మంచిగుర్తింపు వస్తుందన్నారు. యువ ఉద్యోగుల్లో గైర్హాజరు శాతం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గైర్హాజరు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటివరకు 3592 మందికి కారుణ్య ఉద్యోగాలను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో ఓబీ పనులు నిర్వహిస్తున్న జీవీఆర్ కంపెనీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికుల సంఘాల జేఏసీ నాయకులు శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 7వ తేదీన వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించాలన్నారు. బోనస్ చట్టం ప్రకారం అర్హులందరికీ బోనసు ఇవ్వాలన్నారు. విధుల్లో నుంచి తొలగించిన కార్మికులను తిరిగి చేర్చుకోవాలన్నారు. భూ నిర్వాసితులకు ఓబీ పనుల్లో 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా సమ్మె చేస్తున్న కంపెనీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. జేఏసీ నాయకులు అఫ్రోజ్ ఖాన్, శ్రీనివాస్, శంకర్, మల్లేశ్, చక్రవర్తి, పవన్, ప్రసాద్, ప్రశాంత్ సాగర్, కొండయ్య, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



భీమిని కేజీబీవీలో..



చెన్నూర్ కస్తూర్బా పాఠశాలలో..

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వనితావాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, సఖీ, వనితవాక్కు సభ్యులు, వైద్యురాలు అన్నపూర్ణ, జ్యోత్స్న,సునిత, కరుణ, చందన తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ కేజీబీవీ, జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ప్రత్యేకాధికారి సుమలత తెలిపారు. విద్యార్థినులు గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడతూ బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రత్యేకాధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోటపల్లి: కోటపల్లి కేజీబీవీలో ఎస్‌వో హరిత ఆధ్వర్యంలో ముగ్గులు వేసి బాలికా దినోత్సవ అవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఏరియాలో ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తెలియజేయడానికి విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై శ్వేత, హెడ్ కానిస్టేబుళ్లు మాచర్ల, ఆనంద్ పాల్, కిరణ్, నసీర్, రవళి, ప్రవంతి, లస్మయ్య పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ, విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

అనుమతిలేని కళాశాలలపై చర్యలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా ఇంటర్ కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఐఈవో అంజయ్య హెచ్చరించారు. శుక్రవారం పలు విద్యార్థి సంఘాల బాధ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక బన్సల్ కళాశాలలో విచారణ జరిపారు. కళాశాలకు సంబంధించి పూర్తి వివరాలు రెండ్రోజుల్లో సమర్పించాలని, లేనిపక్షంలో అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల బాధ్యులు సల్మాన్, ప్రవీణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

భీమారం: నిర్మల్ జిల్లా సోన్ మండలం షమసాకెరలో జరిగిన గ్రామసభలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా ఫీల్‌అసిస్టెంట్స్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ప్రారంభించనున్న గిరిజన అధ్యయనం సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అర్థశాస్త్ర విభాగాధిపతి గోపాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3న కోర్సు ప్రారంభం కానుందని ఈనెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి అవకాశమని, సర్టిఫికెట్ కోర్సులు చాలా ఉపయోగపడుతాయని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నూర్: పట్టణంలోని 4 వార్డులో గల నలగొండ పోచమ్మవాడలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ తెలిపారు. లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు సురేశ్, గోపికృష్ణ పాల్గొన్నారు.

సన్మానం

లక్సెట్టిపేట: ట్రాన్స్‌పోర్టు అథారిటీ సభ్యుడిగా ఇటీవల నియామకమైన మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన అంకతి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం స్థానిక ఐబీ ఆవరణలో సన్మానించారు. నాయకులు చింత అశోక్, పింగిళి రమేశ్, ఆరీఫ్, అన్నం చిన్నన్న, అమీర్, కిషన్, దేవేందర్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

పాతమంచిర్యాల: పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

చెన్నూర్‌రూరల్: మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ సుల్తాన్ అహ్మద్ జ్ఞాపకార్థంగా మండలంలోని లంబడిపల్లి గ్రామంలో శనివారం నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన కుమారుడు ఇస్మాయిల్ అహ్మద్ జుల్ఫికర్ ఈ పోటీలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500ల ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు.

‘పింఛన్ డబ్బులపై ప్రతిపక్షాలది రాద్ధాంతం’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గతనెలలో ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ డబ్బులను ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలనే కొందరు స్వచ్ఛందంగా డబ్బులు ఇచ్చారని, దీన్ని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. హాజీపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పింఛన్ డబ్బులు ఆస్తి పన్ను కింద జమ చేశారని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే విచారణ జరిపించగా ఒకరి పింఛన్ డబ్బులు మాత్రమే తీసుకున్నట్లుగా ధ్రువీకరణ కాగా కార్యదర్శి సస్పెండ్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పాటుపడుతున్నారని తెలిపారు. కొందరు ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ ఎంపీటీసీలు దేగ బాపు, ఒడ్డె బాలరాజు, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, కొట్టె సత్యం, దొమ్మటి సత్తయ్య, తిరుపతి, నాయికిని సురేందర్, దొమ్మటి బాపు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బ్లడ్‌బ్యాంకులో రక్తదానం

మంచిర్యాలటౌన్: జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సభ్యులు శుక్రవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జగన్నాథ్ షిండే 75వ జన్మదినం ఇదే రోజు కావడంతో, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేశారు. మొత్తం 125 యూనిట్ల రక్తం దాతల ద్వారా సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, రెడ్‌క్రాస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ మహేందర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కిషన్, కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి రాజేంద్ర ప్రసాద్, నాయకులు బాలేశ్వర్‌రావు, శ్రీనివాస్, అనిల్, సంతోశ్, కిరణ్, కిశోర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గుడుంబా స్థావరాలపై దాడులు

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట, ఎసన్‌వాయి గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 12 లీటర్ల గుడుంబాతోపాటు 900 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం చేశారు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటపల్లి ఎస్సై రాజేందర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ అక్బరుద్దీన్ హుస్సేన్, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, చెన్నూర్ సీఐ హరి, బెల్లంపల్లి ఎస్సై వెంకటేశ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన బెల్లంపాకంతో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

నస్పూర్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఎజెండాలో పొందుపర్చిన 13 అంశాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 26తో పాలకవర్గం కాలపరిమితి ముగుస్తుండడంతో అధికారులు చైర్మన్‌తో సహా కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించారు. సమావేశంలో కమిషనర్ చిట్యాల సతీశ్, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, టౌన్‌ప్లానింగ్ అధికారి యశ్వంత్, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట చైర్మన్, కౌన్సిలర్లు

‘గందరగోళం సృష్టిస్తున్న ప్రతిపక్ష నేతలు’

చెన్నూర్‌రూరల్: నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై చూపిస్తున్న అభిమానాన్ని చూసి ఓర్వలేకనే కొందరు ప్రతిపక్ష నేతలు గ్రామసభల్లో గందరగోళం సృష్టిస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి జాడి రాజేందర్ అన్నారు. మండలంలోని కిష్టంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వకుండానే పదేళ్లు పబ్బం గడిపారన్నారు.

యాగశాల మండపాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ

నస్పూర్: పట్టణంలో 86వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం యాగశాల మండపాల నిర్మాణానికి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుత చండీ అతి రుద్రం శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం విశ్వశాంతి మహాయోగ మహోత్సవాన్ని ఫిబ్రవరి 15 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. యాగస్థలం వద్ద 50 అడుగుల శివలింగం, 50 అడుగుల కోదండ రాముడు, గోవర్ధనగిరి శ్రీకృష్ణుని తాత్కాలిక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.